క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో సురేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షత వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులలు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక


తన్నీరు సుజాత


సీ వెంకటేశ్వర్లు

చీమకుర్తి: చీమకుర్తి మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీని మంగళవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తన్నీరు సుజాత, కార్యదర్శిగా కంకణాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా గంగుల చెన్నకేశవులు, వంజా చెన్నయ్య, సహాయ కార్యదర్శిగా తొట్టెంపూడి రామారావును ఎన్నుకున్నారు. ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని నూతన కమిటీ డిమాండ్ చేసింది.

తాళాలు వేసిన ఎండీని సస్పెండ్ చేయాలని వినతి


జేసీకి వినతి పత్రం అందిస్తున్న మాల మహానాడు నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు కో ఆపరేటివ్ సూపర్ బజార్‌కు చెందిన దుకాణాలకు తాళాలు వేసిన ఎండీని సస్పెండ్ చేయాలని మాల మహానాడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు బిళ్లా చెన్నయ్య మంగళవారం జేసీ గోపాలకృష్ణను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలను కొంత మంది దళితులకు గతంలోనే అద్దెకు ఇచ్చారని, అయితే సూపర్ బజార్ మేనిజింగ్ డైరెక్టర్ సురేంద్రబాబు బలవంతంగా దుకాణాలకు తాళాలు వేయించారన్నారు. దీంతో దళితులు వ్యాపారాలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుకాణాలను తెరిపించి వారి జీవనోపాధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో దుకాణదారులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ టీ నారాయణ సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని టీటీడీ సెంటర్‌లో మంగళవారం డీఆర్‌డీఏ-వెలుగు సంస్థ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బ్యాంక్ లింకేజిలను పూర్తి చేయాలన్నారు. బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడి రుణాలను మంజూరు చేయించాలన్నారు. సమావేశంలో డీపీఎంలు రజనీకాంత్, ఫైనాన్స్ కృపారావు, డి దానం, ఏపీఎం ఆదిశేషు, సుబ్బారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సంతనూతలపాడు మండల ఐసీడీఎస్ సూపర్వైజర్ సావిత్రి అన్నారు. మంగళవారం సంతనూతలపాడు అంబేడ్కర్ నగర్ ఒకటో అంగన్వాడీ సెంటర్‌లో సంతనూతలపాడు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో రికార్డులు ఎప్పటికప్పుడు సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా అంగన్వాడీ కేంద్రాలకు సిబ్బంది గైర్హాజరైతే చర్యలు తప్పవన్నారు. సంతనూతలపాడు ఒకటో సెక్టార్ పరిధిలో గుడిపాడు, మైనంపాడు, రుద్రవరం, లక్ష్మీపురం, ఎండ్లూరు, గురువారెడ్డి పాలెం గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

ఒంగోలు టౌన్: గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణను అరికట్టడంలో భాగంగా ఒంగోలు రైల్వే స్టేషన్లో పోలీసులు, ఈగిల్ టీం, జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ అధికారులతో కలిసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం పోలీసు డాగ్‌తో కలిసి ఒంగోలు రైల్వే స్టేషన్ లోని ప్లాట్ ఫాంలతో పాటుగా పార్సెల్ సర్వీసు, స్టేషన్ పరిసరాలు, ఒంగోలు నుంచి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని బోగీలలో తనీఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి పార్శిల్‌ను, ప్రయాణికుల బ్యాగులను అనువణువునా శోధించారు. తనీఖీల్లో మహిళా పీఎస్ సీఐ సుధాకర్, టూ టౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, రూరల్ సీఐ శ్రీకాంత్, చెంచయ్య, ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఈగల్ టీం అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా నాగపంచమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో నాగేంద్రస్వామి


స్కందగిరి సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం దగ్గర నాగేంద్రస్వామి అభిషేకంలో మహిళా భక్తులు


రంగారాయుడు చెరువు దగ్గర జంట నాగేంద్ర స్వామిని పూజిస్తున్న మహిళలు

ఒంగోలు మెట్రో:

శ్రావణమాసంలో వచ్చే నాగ పంచమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం ఉదయం మహిళలు నాగేంద్ర స్వామి పుట్టలకు, విగ్రహాలకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు , శాస్త్రోక్తంగా పూజ క్రతువులు నిర్వహించారు. ఒంగోలు నగరంలో రంగారాయుడు చెరువు దగ్గరున్న నాగేంద్రస్వామి పుట్టలో, మంగమూరు డొంక హరిహరసుత అయ్యప్ప స్వామి క్షేత్రం దగ్గర ఉన్న నాగేంద్ర స్వామి సన్నిధిలో, సంతపేట షిర్డి సాయి బాబా మందిరం, కొండమీద స్కందగిరి వల్లి దేవసేన సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం, జంట నాగేంద్ర స్వామి విగ్రహాలకు, మహిళా భక్తులు పసుపు కుంకుమ పూజలు నిర్వహించారు చలివిడి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతాలు

మంగళ గౌరీ వ్రతాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు మంగమూరుడొంక గాయత్రి మందిరం, బాలాజీ రావు పేటలో కనక దుర్గ అమ్మవారి దేవస్థానం, లాయరు పేట షిర్డి సాయిబాబా మందిరంలో రాజరాజే శ్రీదేవికి, కేశవస్వామి పేటలోని విజయ దుర్గ అమ్మవారు, గద్దలగుంట మహాకాళి మహాలక్ష్మి మహా సరస్వతి, ఆలయంలో, కమ్మపాలెం లోని కాళికా పరమేశ్వరి దేవస్థానం, గొడుగు పాలెంలోని పార్వతమ్మ దేవస్థానం, గాంధీ రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, కొత్తపట్నం బస్టాండ్ దగ్గర ఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో రాజలక్ష్మి అమ్మవారికి, సంతపేట షిర్డి సాయిబాబా మందిరంలో నాగలక్ష్మి అమ్మవారికి, సమతా నగర్ కనకదుర్గమ్మ దేవస్థానం, కేశవస్వామి పేటలోని అతి పురాతన కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గంగా అన్నపూర్ణ అమ్మవారికి, నెహ్రూ కాలనీలోని కనకదుర్గమ్మ వారికి ఆలయ అర్చకులు ఉదయం మహిళా భక్తుల చేత సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

యాదవ భవన్ స్థలాన్ని కదిలించొద్దు

- ఆలిండియా యాదవ మహాసభ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేత


వినతి పత్రాలు అందించిన ఆలిండియా యాదవ మహాసభ నాయకులు

ఒంగోలు సబర్బన్: శ్రీకృష్ణకళ్యాణ మండపం, యాదవ భవన్ నిర్మాణానికి మంజూరు చేసిన భూమిని కదిలించవద్దని ఆల్ ఇండియా యాదవ మహాసభ నాయకులు కోరారు. ఈమేరకు మంగళవారం ఒంగోలు నగరపాలక సంస్థ ప్రాంగణంలోని కౌన్సిల్ హాలు వద్దకు వచ్చిన నేతలు అధికార పార్టీ నేతలకు వినతిపత్రాలు అందజేశారు. ఆల్ ఇండియా యాదవ మహాసభ జనరల్ సెక్రెటరీ కటారి శంకర్ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి నాయకులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రాన్ని అందించారు. ముందుగా నగర మేయర్ గంగాడ సుజాతను కలిసి గతంలో కౌన్సిల్‌లో ఆమోదం పొందిన ధ్రువ పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 24 ఫిబ్రవరి 2024 కౌన్సిల్ సమావేశంలో పెళ్లూరులోని సర్వేనంబర్ 78/1లో 0.70 సెంట్ల భూమిలో కల్యాణ మండపం, యాదవ భవన్ నిర్మాణానికి అజెండాలో పొందుపరిచి ఆమోదం తెలిపిందన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, యాదవుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కూడా చేశారన్నారు. కాని అందులో కేటాయించిన స్థలంలో కొంత భాగాన్ని 21 జూలై 2025 న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారన్నారు. ఆ స్థలం శ్రీకృష్ణకళ్యాణ మండపం, యాదవ భవన్ నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానం పొందిందన్న సంగతి మంత్రికి తెలియదని యాదవ సామాజికవర్గం భావిస్తుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మంది యాదవుల మనోభావాలకు అనుగునంగా కేటాయించిన స్థలాన్ని యదాతథంగా ఉంచాలన్నారు. భవిష్యత్‌లో యాదవ సమావేశాలు, యాదవ కల్యాణాలు, సామూహిక కార్యక్రమాలు, పేద విద్యార్థులకు ఉచిత వసతి గృహం నిర్మించుకొనే అవకాశం కలుగుతుందన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని కటారి శంకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఎండేటి రంగారావు, బొట్ల సుబ్బారావు, చల్లా తిరుమల రావు, జడా వెంకటేష్, యనమల నాగరాజు, అంగిరేకుల గురవయ్య, తిప్పరపల్లి రవితేజ, గండు ధనలక్ష్మి, కండే స్వాతి, ఎండేటి పద్మావతి, మోడుబోయిన సురేష్, మట్టే రాఘవ, చావలి శివ, తాళ్లపాలె శ్రీను, మల్లెబోయిన రాజు, గండు మధు, పిగిలి శ్రీను, గుర్రం వెంకయ్య, నాగం వెంకట్రావు, జమ్ము శ్రీకాంత్, కుట్టుబోయిన కోటి, మిరియం వెంకటేశ్వర్లు, రావులపల్లి శ్రీహరితో పాటు పలువురు పాల్గొన్నారు.

అవగాహనతో చదివితే అద్భుత ఫలితాలు


పాల్గొన్న విద్యార్థులు


మాట్లాడుతున్న ఇంజినీర్ దేసురాజు

ఒంగోలు సిటీ: విద్యార్థులంతా అవగాహనతో చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని ఇంజినీర్ రాధాకృష్ణ దేసురాజు అన్నారు. మంగళవారం ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ, ఈసీఈ విద్యార్థులకు ప్రత్యేక అతిథి ఉపన్యాసం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల్లో పవర్ ఇంజినీరింగ్ విభాగంలో ఇంజినీర్‌గా పనిచేసిన రాధాకృష్ణ దేసురాజు విద్యార్థులకు సోలార్ విద్యుత్ వినియోగం తదితర అంశాలపై ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ మొత్తం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్‌దేనని అన్నారు. ఈవీ కార్లు, మోటార్లు తదితర కొత్త ఆవిష్కరణలకు ఆదరణ వస్తుందన్నారు. రాధాకృష్ణ దేసురాజు చాలా అనుభవజ్ఞులు అని, వివిధ గొప్ప విభాగాల్లో పనిచేసిన వ్యక్తి అని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి దేవి కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వై.వి. హనుమంతరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ సత్య మెహర్, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ మౌళి చంద్ర, డీన్ ఐక్యూఏసీ డాక్టర్ వెంకట ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకేయూలో వనీకరణకు అధిక ప్రాధాన్యత

ఒంగోలు సిటీ: ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో «స్వచ్ఛాంధ్ర-స్వర్ణఆంధ్ర కార్యక్రమం ద్వారా వనీకరణకు అధిక ప్రాధాన్యత కల్పించి పచ్చదనంగా తీర్చి దిద్దుతామని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి అన్నారు. మంగళవారం ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఒంగోలు ప్రాంగణంలోని పరిపాలన భవనంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్క నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ మొక్కలను అధికంగా పెంచడం వల్ల స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తాయని అంతే కాకుండా యూనివర్సిటీ పరిసరాలు పచ్చదనంతో, పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందజేస్తాయన్నారు. పేర్నమిట్ట ప్రాంగణంలో గ్రీనరి ఏర్పాటు కోసం అధిక మొత్తంలో మొక్కలను పెంచేందుకు వీలుగా భవిష్యత్ లో కొంత స్థలాన్ని కూడా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్, యూజీ విభాగం ఏసిటీఈ డాక్టర్ ఎన్.సురేష్, గార్డెనర్ రమేష్ తదితరులు ఉన్నారు.

కరేడులో పోలీసుల నిర్బంధాన్ని ఆపండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు


జిల్లా జైలు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు

ఒంగోలు టౌన్: కరేడులో పోలీసుల నిర్బంధకాండను వెంటనే ఆపాలని, 30 ఏ యాక్టును తక్షణమే ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. కరేడులోని రామకృష్ణాపురంలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ముగ్గురు గిరిజన మహిళలను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేసి జైలుకు తరలించడం దారుణమని తీవ్రంగా ఖండించారు. కరేడు భూ సేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొని జిల్లా జైలులో ఉన్న నాయకులను మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి, అభివృద్ధి పేరుతో బడాబాబులకు భూసంతర్పణ చేస్తోందని ఆరోపించారు. అభివృద్ధి చేయాలన్నా, ఉపాధి కల్పించాలన్నా కార్పొరేట్లకు భూములను కట్టబెట్టక తప్పదన్నట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు భూములు తీసుకున్న కార్పొరేట్లు వాటిని బ్యాంకుల్లో కుదువ పెట్టుకొని కోట్లు సంపాదిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం వద్ద లక్షలాది ఎకరాల పనికిరాని భూమి ఉంచుకొని పంటలు పండే భూములను మాత్రమే కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరేడులో మూడు పంటలు పండే భూములను ఇండోసోల్ కంపెనీకి ధారదత్తం చేయడం వెనక ఉన్న అంతర్యం ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. బలవంతపు భూ సేకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కరేడు భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారి మీద అక్రమంగా కేసులను బనాయించడం దుర్మార్గమన్నారు. పేద ప్రజలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రిమాండ్‌లో వున్నవారిని పరామర్శించిన వారిలో సీపీఎం నాయకులు కాలం సుబ్బారావు, బి.రఘురాం, టి.శ్రీకాంత్, వరమ్మ వెంకటేశ్వర్లు, పద్మ, విజయ, సాయి కుమార్, వైష్ణవి ఉన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం నూతన కమిటీ ఎంపిక


ఎన్నికైన నాయీ బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యులు

మద్దిపాడు: మండల నాయీ బ్రాహ్మణ సంఘం ఎంపికను ఒంగోలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. వెలిగొండ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా యాచవరం శ్రీనివాసులు, కోశాధికారిగా ఈదర చలమయ్య, గౌరవ అధ్యక్షుడిగా ఉప్పుటూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఊసరపల్లి రమేష్ తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ తమ ప్రథమ సమావేశంలో అనేక తీర్మానాలు చేసినట్లుగా కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా తమ కులవృత్తిలోకి ఇతర కులస్తులు ఎవరు రాకుండా ప్రభుత్వం పేటెంట్ హక్కు కల్పించాల్సిందిగా, గత ఎన్నికల హామీలో భాగంగా క్షవరశాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలని, వృత్తి చేస్తూ జీవిస్తున్న తమకు ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి అవకాశాలు ఇవ్వాల్సిందిగా, 50 సంవత్సరాల వృద్ధులకు పెన్షన్ ఇవ్వాలని తీర్మానాలు చేసి అధికారులకు నివేదించుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండలంలోని నాయీబ్రాహ్మణులు పాల్గొన్నారు.

దాడుల్లో పట్టుబడిన మద్యం సీసాలు ధ్వంసం

చీమకుర్తి: ఎక్సైజ్ అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న 157 మద్యం సీసాలను మంగళవారం చీమకుర్తి ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఎక్సైజ్ అధికారుల దాడుల్లో పట్టుబడ్డ ఆటో, బైకుకు బహిరంగ వేలం నిర్వహించినా ఎవ్వరూ పాల్గొనలేదు. దీంతో వచ్చే నెల 5న తిరిగి వేలం నిర్వహిస్తామని అధికారులు పాల్గొన్నారు.


ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న రెవెన్యూ కార్యాలయం

ఖాళీగా రెవెన్యూ కార్యాలయం

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని అధికారులు అప్పుడప్పుడు సభలు, సమావేశాల్లో ఉపన్యాసాలు ఇస్తుంటారు.. కాని పాటించరు. సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం మంగళవారం ఖాళీ కుర్చీలతో కనిపించింది. తహసీల్దార్ నారాయణరెడ్డి కార్యాలయ పరిధికి సంబంధించిన కోర్టు పని నిమిత్తం హైకోర్టుకు వెళ్లినట్లు కంప్యూటర్ ఆపరేటర్ తెలిపారు. డీటీ, సీనియర్ అసిస్టెంట్‌లు డిప్యూటేషన్‌పై ఒంగోలు ఆర్‌డీవో కార్యాలయంలో పనిచేస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ ట్రెజరీకి వెళ్లినట్లు, సీనియర్ అసిస్టెంట్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది లేక వెలవెలబోతోంది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీచేసి ప్రజల కష్టాలు తీర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పిల్లలకు తాగునీరు కూడా లేదా..


హైస్కూల్‌ను పరిశీలిస్తున్న బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు సిటీ: ఒంగోలులోని డీఆర్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి స్కూల్లో తాగునీటి వసతి లేకపోవడం, ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో హెచ్ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి 100 కేజీలు బియ్యం తేడా ఉండడాన్ని గమనించి తహసీల్దార్ ద్వారా బియ్యాన్ని స్టాక్ లోకి తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పిల్లలకి అందుబాటులో ఉండేలా కంప్లైంట్ బాక్స్ విధిగా ఉండాలన్నారు. నెలలో ఒకరోజు తప్పనిసరిగా మెడికల్ ఆఫీసర్ వారి ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని పరిశీలించి తగు సూచనలు తీసుకోవాలన్నారు. హెల్త్ కార్డుల జారీ విషయంలో కూడా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. మహిళా కార్యదర్శి ద్వారా డ్రాప్ అవుట్‌కు సంబంధించిన పిల్లల వివరాలను తెలుసుకొని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలబాలికలకు సంరక్షణ కమిటీలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా సైబర్ క్రైమ్ తదితర అంశాలపై బాలబాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి క్లాస్ లో పిల్లలకు అనుకూలంగా ఉండే టీచర్‌ను ఎంపిక చేసి వారి ద్వారా పిల్లలను అభివృద్ధిలో ఉండేలా తగు చర్యలు తీసుకోవాల్సిందని అధికారులను ఆదేశించారు. గవళ్లపాలెం స్కూల్లో ఇద్దరు పీఈటీలలో ఒక టీచర్‌ను రాజుపాలెం హైస్కూల్లో ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం కొత్తపట్నం జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. బియ్యం, గుడ్లు, బెల్లం, రాగి పిండిలో ఉన్న వ్యత్యాసం గుర్తించి అధికారులను ప్రశ్నించారు. గుడ్లు బయట నుంచి కొని తీసుకురావడం, బిల్లు లేకుండా తీసుకురావడాన్ని గమనించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాగిజావ ఇవ్వకుండా ఉండడాన్ని తీవ్రంగా పరిగణించి షోకాజ్ నోటీస్ ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు, సీఎంవో ఆధ్వర్యంలో టీచర్లకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో బాలల సంరక్షణ కమిటీ సభ్యురాలు డీ నీలిమ, న్యాయ, పర్యవేక్షణ అధికారి రత్న ప్రసాద్, కొత్తపట్నం ఎస్ఐ వేముల సుధాకర్, సోషల్ వర్కర్ సమాధానం పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన పెంచుకోవాలి

- డీఆర్‌ఓ ఓబులేసు


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ ఓబులేసు, పట్టుపరిశ్రమ జిల్లా అధికారి

ఒంగోలు సబర్బన్: ప్రభుత్వ ఉద్యోగి బాధ్యతలు, సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులకు ఏ విధంగా సహాయపడగలమో అవగాహన పెంచుకోవాలని డీఆర్‌ఓ బీసీహెచ్.ఓబులేసు పేర్కొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం, 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్లకు చెందిన సమాచార హక్కు ప్రచార ఐక్య వేదిక నాయకుడు ఏ.బాలాజీ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులకు ఏ విధంగా సమాచారం ఇవ్వాలి, దరఖాస్తుదారుని పట్ల ఉద్యోగి వ్యవహారశైలి ఎలా ఉండాలి, ఎంత గడువు లోపు సమాచారం ఇవ్వాలి, సర్టిఫైడ్ కాపీలకు రుసుము ఎంత తీసుకోవచ్చు, ఆలస్యానికి చెల్లించాల్సిన జరిమానా, అదనపు సమాచారం ఎప్పుడు అందించాలి, నిర్దేశించిన గడువులో సమాచారం ఇవ్వకపోతే దాని పరిణామాల గురించి విపులంగా సిబ్బందికి వివరించారు. సిబ్బంది సందేహాలకు సమాధానం ఇచ్చారు. జిల్లా పట్టుపరిశ్రమ అధికారి డాక్టర్ పి.సుజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించే పౌరుల పట్ల ఉద్యోగి సహృదయంతో, గౌరవంతో వ్యవహరించాలని కోరారు.

దొంగచాటుగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు


స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకున్న వడ్డీవానికుంట వాసులు

ఒంగోలు టౌన్: ఇళ్లల్లో ఎవరూ లేని సమయం చూసుకొని దొంగచాటుగా స్మార్ట్ మీటర్లను బిగిస్తున్న టెక్నీషియన్లను స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటన నగరంలోని సుందయ్య నగర్‌లోని వడ్డివానికుంటలో జరిగింది. వడ్డివానికుంటలో ఎక్కువగా నిరుపేద సామాన్య జనం నివశిస్తుంటారు. ఉదయం 9 గంటల నుంచే పనులకు వెళతారు. అదే అదనుగా చూసుకొన్న అదానీ కంపెనీకి చెందిన టెక్నీషియన్లు మంగళవారం ఉదయం ఇళ్లలో ఎవరూ లేని సమయంలో వచ్చి స్మార్ట్ మీటర్లను బిగించడం మొదలుపెట్టారు. కాసేపటి తరువాత అటుగా వచ్చిన ఒక వ్యక్తి చూసి ఈ విషయాన్ని స్థానిక సీపీఎం నాయకులకు చేరవేశాడు. సమాచారం తెలిసిన వెంటనే సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, నగర నాయకులు బీవీ రావు, రామకృష్ణదాసు హుటాహుటిన వడ్డివానికుంటకు చేరుకున్నారు. ఈ లోపు సమాచారం తెలుసుకున్న స్థానికులు కొందరు అక్కడకు చేరుకున్నారు. వారితో కలిసి సీపీఎం నాయకులు టెక్నీషియన్లను అడ్డుకున్నారు. ఇళ్లలో ఎవరూ లేని సమయంలో, ఇంటి యజమాని అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లను ఎలా బిగిస్తారని నిలదీశారు. దాంతో నీళ్లు నమిలిన టెక్నీషియన్లు చల్లగా జారుకున్నారు. ఈ సందర్భంగా చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వలన ప్రజలపై అదనపు భారం పడుతుందని, ప్రతి గంట గంటకు విద్యుత్ ఫీజుల ధరలు మారుతుంటాయని తెలిపారు. గతంలో విద్యుత్ బిల్లులు వచ్చిన వారం రోజుల వరకు బిల్లులు చెల్లించే అవకాశం ఉండేదని, ఇప్పుడు రీచార్జి విధానం అమలు చేయనుండడంతో వెంటనే బిల్లు చెల్లించాల్సి వస్తుందన్నారు. రీచార్జి అయిపోయిన వెంటనే కరెంటు పోతుందన్నారు. స్మార్ట్ మీటర్లు వద్దు అని ప్రజలంతా నినదించాలని, స్మార్ట్ మీటర్లను బిగించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను బిగించడం ఉపసంహరించుకోవాలని, పెంచిన విద్యుత్ చార్జీలకు వెంటనే తగ్గించాలని, ప్రజలపై విద్యుత్ భారాలు వేయరాదని డిమాండ్ చేస్తూ ఆగస్టు 5వ తేదీ విద్యుత్ భవనం వద్ద ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో నగర ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

భర్త బంధువులు వేధిస్తున్నారు.. !


మాట్లాడుతున్న బాధితురాలు వినుత

ఒంగోలు టౌన్: భర్త బంధువుల వేధిస్తున్నారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉంది.. తగిన రక్షణ కల్పించి న్యాయం చేయాలని నగరానికి చెందిన ఆకుపోగు వినుత ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక ఎంసీపీ భవనంలో ఆమె విలేకరుల ఎదుట తన గోడు వెళ్లబోసుకున్నారు. బాధితురాలి కథనం ప్రకారం.. నగరంలోని మామిడిపాలెంలో నివాసం ఉండే కృపాదానం మొదటి భార్య చనిపోవడంతో వినుతను 2021లో రెండో వివాహం చేసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. భర్త తాలుకు బంధువులు వచ్చి వినుతను చివరి చూపులు చూడకుండానే అంత్యక్రియలు నిర్వహించారు. వినుతను ఇంటి నుంచి బయటకు నెట్టివేశారు. దాంతో వినుతతో పాటుగా 81 ఏళ్ల వయసు కలిగిన ఆమె తల్లి నిలవనీడ లేకపోవడంతో చర్చిలో పడుకుంటున్నారు. భర్త చికిత్స కోసం తాకట్టు పెట్టిన బంగారు నగలను విడిపించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను ఆశ్రయిస్తే కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎస్సై సువర్ణ దురుసుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. తనతో వచ్చిన లాయర్‌ను కూడా కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. దాంతో కలెక్టర్, ఎస్పీలను కలిసి ఫిర్యాదు అందజేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తన భర్త ఇంటి తాళాలను పగులగొట్టి సాక్ష్యాలను లేకుండా చేస్తున్నారని, వెంటనే పోలీసులు తగిన చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని, ప్రాణహాని కలగకుండా రక్షణ కల్పించాలని కోరారు. విలేకరుల సమావేశంలో బాధితురాలి తల్లి జగదాంబ కూడా ఉన్నారు.